క్లుప్తంగా

అసెంబ్లీ పరిశీలకుడిగా ఓడూరు గిరిధర్‌రెడ్డి



శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన ఓడూరు గిరిధర్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యార్థినికి అభినందన

ఏర్పేడు: మండలంలోని కాట్రకాయలగుంట ప్రాథమిక పాఠశాలలో జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికైన విద్యార్థిని మౌనికను బుధవారం ఎంఈఓ దయాకర్ అభినందించారు. 5వ తరతగతి చదువుతున్న మౌనిక వలసపల్లి నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించింది. ఎంఈఓ–2 దయాకర్, ఉపాధ్యాయులు అభినందించి, నగదు బహుమతిని అందజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం జోనల్ ఎన్నికల అధికారి రాజశేఖర్, మండల ఎన్నికల అధికారి, తహసీల్దారు పటాన్ మహ్మద్ ఆలీఖాన్, డిప్యూటీ తహసీల్దారు చంద్రబాబునాయుడు పరిశీలించారు. వారు మాట్లాడుతూ త్వరలో పోలింగ్ కోసం సౌకర్యాలు ఉన్న గదులను ఎంపిక చేసినట్లు తెలిపారు. గదులకు విద్యుత్, తాగు నీరు, మరుగుదొడ్లు సౌకర్యం ఉందా, లేదని చూశామని, వివరాలను జిల్లా ఎన్నికల అధికారులకు అందజేస్తామని తెలిపారు. గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న ఎంఈఓ బాలయ్య

శ్రీకాళహస్తి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని ఎంఈవో అంబటి బాలయ్య అన్నారు. పట్టణంలోని సన్నిధివీధి పురపాలకసంఘ ప్రాథమిక పాఠశాలలో బుధవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం ప్రసూన, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి వెన్నెముక

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- కరకంబాడిలో వైఎస్సార్ సీపీ
- కార్యాలయం ప్రారంభం



కరకంబాడిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: వైఎస్సార్ సీపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడంలో పార్టీ కార్యకర్తలే మూలస్తంభాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరకంబాడిలో మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయనకు స్థానికులు క్రేన్ ద్వారా భారీ పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని అన్నారు. గత ఎన్నికల్లో గ్రామస్థాయిలో అందరూ కలసికట్టుగా శ్రమించడం వల్ల మండలంలో 13వేల పైచిలుకు ఓట్లు మెజారిటీ తనకు వచ్చిందని గుర్తు చేసుకున్నారు. తాను గెలిచాక నాలుగున్నరేళ్లలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ 30 ఏళ్లలో లేని అభివృద్ధిని చేసి చూపానన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే కార్యకర్తల తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీకి మెజారిటీ వచ్చేలా పనిచేయాలని కోరారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ ఈశ్వరమ్మ, ఎంపీటీసీలు శ్రావణి, కస్తూరి, కన్నయ్య, ప్రకాష్, నాటం సుబ్రమణ్యం, పీడీ దిలీప్, కృష్ణమూర్తి, పీడీ బాబు, రాజేష్, కాలేషా పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక





బియ్యపు పవిత్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నాయకులు, షేక్ బాజీకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని మడిబాక పంచాయతీ పరిధి రాజులకండ్రిగలో బుధవారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. భాస్కర్ రాజు, పుల్లమరాజు, సుబ్బరాజు మరో పదిమంది నాయకులు, కార్యకర్తలకు బుధవారం శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు చెప్పారు. వైఎస్సార్ సీపీ గెలుపునకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. సర్పంచ్ చెంగల్‌రాజు, మునికృష్ణమ రాజు, మణి రాజు పాల్గొన్నారు.

సొంత గూటికి పేరెంట్స్ కమిటీ చైర్మన్

రేణిగుంట: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామానగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ బాజీ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో ఆయనకు మంగళవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. స్నేహితుల ఒత్తిడి వల్ల తాను ఇటీవల చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరానని, తనకు పదవి ఇచ్చి ఉన్నతికి కృషి చేసిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి నమ్మకద్రోహం చేయకూడదని తిరిగి సొంతగూటికి వచ్చినట్లు ఆయన మీడియాకు వివరించారు. ఈ కార్యక్రమంలో తారకరామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి, నాయకులు కాలేషా, రాజేష్, రామచంద్ర, ఇంతియాజ్, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాలకనుగుణంగా బోధన సాగాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేస్తూ, అన్ని సబ్జెక్టులపై మక్కువ కల్పించాలని మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రమణ్యం అన్నారు. బుధవారం ఆయన మండలంలోని గాజులపెళ్లూరు ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. నోట్ పుస్తకాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలని, పాఠ్యాంశాలపై పట్టు పెంచుతూ సృజనాత్మకతను, ప్రతిభను వెలికి తీయాలన్నారు. విద్యార్థుల హోమ్‌వర్క్ నోట్స్ పరిశీలించి, తప్పులను సరిదిద్దాలని తెలిపారు.

పోలీసు కవాతు



శ్రీకాళహస్తి: బీఎన్ కండ్రిగ సర్కిల్ పరిధి తొట్టంబేడు మండలంలో సమస్యాత్మక ప్రాంతాలైన పూడి, ఇలగనూరు, గురప్పనాయుడు కండ్రిగ, కొణతనేరి గ్రామాల్లో సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ కండ్రిగ ఇన్‌చార్జి సీఐ రారాజు మాట్లాడుతూ ప్రజలందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవచ్చని భరోసా కల్పించేందుకే గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రామ వలంటీర్ల రాజీనామా



రాజీనామా లేఖను అందిస్తున్న వలంటీర్లు

రేణిగుంట: తెలుగుదేశం నాయకుల వ్యాఖ్యలను నిరసిస్తూ మండలంలోని కరకంబాడి–3వ సచివాలయంలో పరిధిలోని ముగ్గురు గ్రామ వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. రాజేంద్ర, మల్లెల కిరణ్‌కుమార్, రాజేంద్రప్రసాద్‌లు తమ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు పత్రాలను పంచాయతీ కార్యాలయంలో ఉన్న గ్రామ కార్యదర్శి యూసఫ్‌ఖాన్‌కు అందజేశారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గెలుపునకు, వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తమ వంతు బాధ్యతగా పని చేస్తామని వారు స్పష్టం చేశారు.

వైభవంగా నల్లగంగమ్మ జాతర



సారె అందజేస్తున్న చైర్మన్ అంజూరు శ్రీనివాసులు



భక్తజన సందడి

శ్రీకాళహస్తి: పట్టణంలోని తెట్టుప్రాంతంలో వరాల తల్లిగా నీరాజలందుకుంటున్న ప్రసిద్ధ నల్లగంగమ్మ ఆలయ జాతర బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. పరిసర ప్రాంతాల ప్రజలు ఉదయాన్నే స్నానమాచరించి ఆలయం వద్దకు పొంగళ్లు పెట్టేందుకు ఊరేగింపుగా వచ్చారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. భక్తులు అశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి పురవీధుల్లో ఊరేగించి, ఆలయం వెలుపల కొలువు దీర్చారు. పట్టణ ప్రజలు పెద్దసంఖ్యలో అమ్మ వారిని దర్శించి మొక్కులు సమర్పించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా నల్లగంగమ్మ జాతరను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సారెను సమర్పించారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుమ్మడి బాలకృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, కళత్తూరు మునిరాజా, మొగరాల గణేష్, కొల్లూరు హరినాథ్‌నాయుడు, పత్తి మణి, కొట్టే నరేష్, పాలమంగళం శివ, ప్రకాష్, అమర్, సుధీర్, సాయి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మండల అభిషేక పూజలు

- అనుబంధ ఆలయాల్లో విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న మార్కండేయ తీర్థం, వేయిలింగాలకోన, దుర్గేశ్వరస్వామి ఆలయం, ఈటీసీ సెంటర్ శివాలయం, ఊరందూరులోని అన్నపూర్ణదేవి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో బుధవారం మహా మండలాభిషేకం పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేష హోమాలు, పూజలు చేపట్టారు. ఈ పూజల్లో శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అనుబంధ ఆలయాలకు పూర్వవైభవం తీసుకురావడమే ధర్మకర్తల మండలి లక్ష్యమన్నారు. ఈ ఆలయాల్లో మహా కుంభాభిషేకం నిర్వహించి 41రోజులు గడిచిన నేపథ్యంలో ఈ విశేషపూజలు నిర్వహించినట్లు తెలిపారు. పాలకమండలి సభ్యురాలు భారతి, ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, ఉప ప్రధానార్చకుడు దక్షిణామూర్తి, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్, అధికారులు సతీష్‌మాలిక్, లక్ష్మయ్య, వేదపండితులు సంగమేశ్వరశర్మ పాల్గొన్నారు.

ఉపాధిలో పండ్ల తోటల పెంపకం



నరసరాజు అగ్రహారంలో పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

సత్యవేడు: ఉపాధి హామీ పథకంలోని పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని పీడీ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని నరసరాజు అగ్రహారం పంచాయతీలో చెరువు పూడిక తీత పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఏప్రిల్ నుంచి రోజుకు రూ.300 కూలి ఇస్తున్నట్లు తెలిపారు ఈపథకంలో రైతులు పండ్లతోటలు, పూలతోటలు, మునగ తోటలు, పెంచుకుని లబ్ధిపొందాలని సూచించారు. చెరువు పూడిక, కాలుల పూడిక పనులు రైతులు చేసుకోవచ్చన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచాలని ఫీల్డు అసిస్టెంట్‌లను ఆదేశించారు. ఈకార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, ఏపీఓ కృష్ణయ్య, ఈసీ గుణశేఖర్ టెక్నికల్ అసిస్టెంట్ సుమలత, ఫీల్డుఅసిస్టెంట్ ధరణీకుమార్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.



దామలచెరువులో అశేష ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి



తనపల్లె క్రాస్‌లో పోటెత్తిన అభిమానులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివాదం

గుండెలనిండా అభిమానం

మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. తమ అభిమాన నాయకుడు వస్తుండడంతో పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సీఎం కాన్వాయ్ పూతలపట్టు నుంచి పాకాల మండలంలోకి ప్రవేశించిన తర్వాత గాదంకి, పనపాకం, కొంగరవారిపల్లి, ముంగళిపట్టు, ఐతేపల్లి, చంద్రగిరి, సీమల్లవరం, వేదాంతపురం సర్కిల్ మీదుగా తిరుచానూరు చేరుకుంది. తనపల్లి, తిరుచానూరు వరకు పెద్ద సంఖ్యలో జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ రోడ్డు పైకి చేరుకున్నారు. సీఎం తన కాన్వాయ్‌ను ఆపి ప్రజలకు అభివాదం చేశారు. దారి పొడవునా పార్టీ శ్రేణులు మంగళహారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు.

– తిరుపతి రూరల్/చంద్రగిరి/పాకాల



అభిమాన నేత కోసం ఎదురు చూస్తూ....



బస్సు యాత్రలో అభిమాన కెరటం



అభిమానుల కోలాహలం..



అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



ఆత్మీయ నేత రాక కోసం..

పోలీసుపైనే తిరగబడిన టీడీపీ నేత



వన్‌వేలో కారులో వెళుతున్న టీడీపీ నాయకుడు

శ్రీకాళహస్తి: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ముఖ్యఅనుచరుడు కలవగుంట సుధాకర్‌రెడ్డి వన్‌వేలో ట్రాఫిక్ రూల్స్‌కు విరుద్ధంగా కారుతో ప్రవేశించడంతో పాటు పోలీసులకే ఎదురు తిరిగాడు. బుధవారం జరిగిన ఘటనలో పోలీసులు ఆయనను వారించబోయారు. 'సార్ ఈ రోడ్డులో ఫోర్‌వీలర్ నాట్ అలౌడ్ ఇలా వెళ్లకూడదు' అని మర్యాదగా చెప్పారు. అయినా రెచ్చిపోయిన సుధాకర్‌రెడ్డి మూడు నెలలు ఆగండి మీ అంతు చూస్తామంటూ చేయి చూపిస్తూ కానిస్టేబుల్‌ను బెదిరించాడు. ఎంత వారించినా వినకుండా వన్‌వేలోనే ముందుకు వెళ్లాడు. బొజ్జల సుధీర్‌రెడ్డి అనుచరులు రౌడీల్లా ప్రవర్తించడంపై ప్రజలు నిర్ఘాంతపోయారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సంస్థ సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని రామసేతు వంతెన వద్ద భారత్ సోషల్ సర్వీస్ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీపురం సుధాకర్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన గొప్పతనాన్ని వివరించారు. సంస్థ సభ్యులు చంద్రశేఖర్‌రావు, తోట ప్రసాద్, పగడాల ప్రతాప్, సిద్ధులగారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.